# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. 'సంపన్న, ఆరోగ్య, సంతోష ఆంధ్రప్రదేశ్' నినాదంతో స్వర్ణాంధ్ర-2047' విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
2. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ఆర్థిక క్రమశిక్షణ అవసరమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.
3. ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు.
4. ఆహార పదార్థాల కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.
5. సమాచార, ప్రసార రంగాల్లో విశిష్ట సేవలందిస్తోన్న ప్రసారభారతి నేటితో 27 సంవత్సరాలు పూర్తిచేసుకుంది.

==========================

'సంపన్న, ఆరోగ్య, సంతోష ఆంధ్రప్రదేశ్' నినాదంతో స్వర్ణాంధ్ర-2047' విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా 'స్వర్ణాంధ్ర-2047' డాక్యుమెంట్‌పై నిన్న జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను సమతుల్యం చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 2047 వికసిత్ భారత్‌కు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విధానంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ఆర్థిక క్రమశిక్షణ అవసరమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. హైదరాబాద్‌లోని సైఫాబాద్ ఏజీ కార్యాలయంలో ఆడిట్ వారోత్సవాలు-2024 ముగింపు కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, అన్ని పాలన విభాగాల్లో కృత్రిమ మేధని విస్తృతంగా వినియోగించడం ద్వారా ఆడిట్, అకౌంటింగ్ ప్రక్రియ మెరుగుపడుతుందని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థల్లో ఆడిటింగ్‌కి సంబంధించి సాంకేతికత పెరిగిన నేపథ్యంలో కాగిత రహిత

కార్యకలాపాలకు ప్రాధాన్యమివ్వాలని గవర్నర్ తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో హస్తకళలు, కళాకారులకు పూర్వ వైభవం తెచ్చేందుకు ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. విజయవాడ పటమటలోని లేపాక్షి గాంధీ శిల్ప బజార్‌ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో లేపాక్షి, ఆప్కో, చేనేత వస్త్రాల అమ్మకాలు పెరిగాయని చెప్పారు. త్వరలో విదేశాల్లోనూ చేనేత ప్రదర్శనల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (32 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన దీపం-2 పథకం లబ్ధిదారుల సంఖ్య 50 లక్షలకు చేరిందనిఇ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో నిన్న జరిగిన దీపం-2 ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం విజయవంతంగా అమలవుతోందని, అత్యంత పారదర్శకంగా ఈ పథకం కొనసాగుతుందని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ దీపం-2 పథకాన్ని అందజేస్తామని మంత్రి తెలియజేశారు.

---------------------------

ఆహార పదార్థాల కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆహార భద్రతా అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆహార భద్రతపై నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వసతి గృహాలపై పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఓవైపు కల్తీ చేసే వారిపై చర్యలు తీసుకుంటూనే.. మరోవైపు ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు మంత్రి సూచించారు.

---------------------------

తెలంగాణలో నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రజలను భాగస్వామ్యుల్ని చేస్తూ, కార్యక్రమాలను నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన విజయోత్సవాలపై హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ, ఉత్సవాల్లో భాగంగా ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో రైతుదినోత్సవ సభ, వచ్చేనెల 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ మార్గాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని ఉపముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

సమాచార, ప్రసార రంగాల్లో విశిష్టమైన విశ్వసనీయమైన సేవలందిస్తోన్న ప్రసారభారతి నేటితో 27 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. 1997 నవంబరు 23వ తేదీన పార్లమెంటు రూపొందించిన ప్రసారభారతి చట్టంతో బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ ఆవిర్భవించింది. ప్రసారభారతి ఆధ్వర్యంలో ఆకాశవాణి, దూరదర్శన్‌లు

ప్రజలకు విస్తృత సేవలను అందిస్తూ సమాచార, ప్రసారరంగంలో గణనీయమైన పాత్రను పోషిస్తున్నాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో సాగు చేసిన అరటిని రైతులు గల్ఫ్ దేశాలకు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం బనానా రైలును ప్రారంభించిందని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి ముంబైకి వెళ్లే “బనానా రైలు”ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ రైలు ద్వారా అనంతపురం జిల్లాలో పండించిన అరటిని ముంబైకి తరలించి అక్కడినుండి గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాబోయే కాలంలో కిసాన్ రైలును ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ తెలియజేస్తూ...

వాయిస్ (32 సెకన్లు )

---------------------------

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ గణన హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ – జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటివరకు 63 శాతం పూర్తి అయిందని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ వెల్లడించారు. హైదరాబాద్ కాచిగూడలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆమె నిన్న పరిశీలించారు. గణన చేస్తోన్న అధికారులతో స్థానికుల వివరాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈ నెల చివరి నాటికి సర్వే పూర్తి చేస్తామని.. అవసరమయితే మరికొన్ని రోజులు గడువు పొడిగిస్తామని తెలిపారు. గణనపై చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని వివరాలను నమోదు చేసుకోవాలని విజయలక్ష్మి కోరారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయువ్యదిశగా కదులుతూ... వాయుగుండంగా మారుతుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈ నెల 26, 27 తేదీలలో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర సహా.. తెలంగాణలో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో కాకినాడ, కృష్ణా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, బాపట్ల, ప్రకాశం, నెల్లూరుతో పాటు చిత్తూరు, తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్‌లలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================